ప్రజాశక్తి
బుధవారం 26 జులై 2023 5
శ్రీ సత్యసాయి

కలెక్టర్ కారు ముందు నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మణిపూర్ మారణకాండకు

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌దే బాధ్యత

కలెక్టర్ కారును అడ్డుకుని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

బిజెపి, ఆర్‌ఎస్ఎస్ జాతుల మధ్య విద్వేషాలు పెంచడం వల్లనే మణిపూర్‌లో మారణకాండ రగులుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. మాణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ, మహిళలపై అకృత్యాలను ఆపాలని డిమాండ్ చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు కారును సిపిఎం నాయకులు దిగ్బంధించారు. మంగళవారం ఉదయం పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట కలెక్టర్ కారును అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చలా తయారవుతున్న మణిపూర్ హింసను ఆపేలా కేంద్రం ప్రభుత్వం, ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లేలా కలెక్టర్ రాతపూర్వకంగా లేఖ రాయాలని కోరారు. అక్కడ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై అక్కడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలల నుంచి మణిపూర్‌లో రెండు జాతుల మధ్య జరుగుతున్న వైరం అనేక మంది ప్రాణాలను బలితీసుకుందన్నారు. దాదాపు 150 మంది హత్యగావింపబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాలూ జరుగుతున్నాయని చెప్పారు. సభ్యసమాజం తలదించుకునేలా మహిళలను వివస్త్రలను చేసి ఊరేగిస్తున్నారని చెప్పావు. కుకి గిరిజన తెగకు సంబంధించి నాలుగు వేల గృహాలను తగలబెట్టారని చెప్పారు. దాదాపు 60వేల మందికిపైగా గ్రామాల వదిలి వెళ్లారంటే అక్కడ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. గిరిజనుల భూములు కార్పొరేట్లకు అప్పగించే దిశగా అక్కడి బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హింసకు ఆజ్యం పోసినట్లు అయ్యిందన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ మణిపూర్ హింసను నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రధాని దేశ చరిత్రలో చరిత్రహీనుడుగా మిగులుతారని హెచ్చరించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు స్పందించి మణిపూర్ హింసను ఆపేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖలు పంపాలని కోరారు. కలెక్టర్ వాహనం ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులతో సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, నాయకులు రామకృష్ణ, బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబ్బాబు..మీకేం కావాలి..?

- ఎన్నికలు సమీస్తున్న వేళ కార్యకర్తలకు తాయిలాలు
- స్థలాలు చూసుకోండి.. భూ పంపిణీలో మీకూ ఇస్తాం.!
- మద్దతుదారులను ప్రసన్నం చేసుకునే పనిలో అధికార పార్టీ నేతలు

ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ వేడి మొదలైంది. 2024 ఎన్నికలకు సన్నద్ధం అయ్యేలా అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పటి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నాయి. గెలుపే లక్ష్యంగా అందరినీ ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు పడ్డారు. అధికార పార్టీలో ఈ ప్రక్రియ ఎక్కువగా కన్పిస్తోంది. ఎందుకంటే అధికారం ఉండి కూడా ఈ నాలుగేళ్లలో తామేమీ లబ్ధిపొందలేదనే భావన ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఈ సారి ఎన్నికల్లో అభ్యర్థులకు వీరు సహకరించే విషయంలో కూడా సందిగ్ధం నెలకొంది. దీంతో అధికార పార్టీ నేతలు ఆయా గ్రామాల వారీగా ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార వైసిపిలో కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునే పనులు ప్రారంభమయ్యాయి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12, రెండు పార్లమెంటు స్థానాల్లోనూ వైసిపి గెలుపొందింది. మొదటి సారి ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ద్వితీయశ్రేణి నాయకులు వారి భవిష్యత్తుపై చాలానే ఆశలు పెట్టుకున్నారు. అయితే వైసిపి అధికారం చేపట్టినా ద్వితీయ శ్రేణి, కార్యకర్తలను ముఖ్య నేతలెవరూ పట్టించుకోలేదన్న భావన కింద స్థాయి నేతల్లో ఉంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలోనూ పలుమార్లు నాయకులు, ముఖ్య నేతల తీరును కార్యకర్తలు ఎత్తిచూపారు. వారు ఏ రకంగా సంపాదించుకుంటున్నారో కూడా తెలియజేశారు. ఈ సమీక్షలు తరచూ జరుగుతుండటంతో కొంతమంది ఎమ్మెల్యే, ముఖ్య నాయకుల పట్ల అధిష్టానం కూడా సీరియస్‌గానే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏదో రకంగా అసంతృప్తితోనున్న వారిని తమ దారికి తెచ్చుకునేందుకు ముఖ్య నేతలు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అందరినీ పిలిచి ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. ఏమి కావాలో అడిగి తెలుసుకుని వాటిని చేసే పెట్టే పనుల్లో కొంత మంది నేతలు నిమగ్నమయ్యారు. ఇందులో అనంతపురం, సత్యసాయి జిల్లా పరిధిలోనున్న ఒక నియోజకవర్గ నాయకులు ఆయనకు సమయం దొరికనప్పుడల్లా పంచాయతీల వారీగా నేతలను పిలిపించి వారి సమస్యలు వినడం, ఏమి చేయాలని అడగటం జరుగుతోంది. వాటిని పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటున్నట్టు కూడా హామీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో మకాంవేసి ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి అసంతృప్తులను తిరిగి బుజ్జగించే పనిని చేపట్టారు. ఇంకో నియోజక వర్గంలో ప్రభుత్వం పంపిణీ చేయనున్న భూ పంపిణీలో వారికి కేటాయించాలని అధికారులకు ఆదేశాలిస్తున్నారు. అదే విధంగా విలువైన చోట ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఒక్కొక్కరి రెండు నుంచి మూడు సెంట్ల వరకైనా ఇంటి స్థలాన్ని కేటాయించాలని అధికారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని నియోజక వర్గాల్లోనూ భూ పంపిణీలోనే అసంతృప్తులను సంతృప్తి పరిచే చర్యలు చేపట్టారు.

అభివృద్ధి పనులు తీసుకునేందుకు వెనుకడుగు..!

వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు చేసుకోమంటే చేసుకోవడానికి కార్యకర్తలే వెనుకడుగువేస్తున్నారు. బిల్లులు సకాలంలో రాకపోతే ఇబ్బందులు పడుతామన్న ఉద్దేశంతో పనులు తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అది కూడా గతంలో 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ రకంగా పనులు చేసి బిల్లులు రాక ఇప్పటికీ ఇబ్బందులు పడుతుండటం చూసి వీరు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా భూములు అవి కాకుండా ఇసుక, మట్టిని విక్రయించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రకంగా ఎన్నికలకు ముందు కార్యకర్తలకు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉన్న అసంతృప్తిని చల్లార్చి తిరిగి ఎన్నికల్లో పనిచేయించుకునే ఆలోచన ముఖ్య నేతలు చేస్తున్నారు. దీంతో ఆ నేతల ఇళ్ల వద్ద ఇటీవల నిత్యం రద్దీ

వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లతో ఉపయోగం

వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించిన ముఖ్యమంత్రి

వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్, కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో అత్యధికంగా పండించే వేరుశనగ రైతులకు సెకండరీ ప్రాసెస్, ప్రైమరీ ప్రాసెస్‌సింగ్ యూనిట్ల వల్ల రైతులకు ఎంతో ఉపయోగమని కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలియజేశారు. మంగళవారం నాడు ధర్మవరం మండలం చిగిచెర్లలో సుమారు రూ.72 కోట్ల వ్యవయంతో వేరుశనగ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్, రూ.5.5 కోట్లతో ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లను వర్చువల్ విధానం ద్వారా తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయలు పండ్లు గ్రేడింగ్ ప్యాకింగ్ వసతుల ప్యాకింగ్ నెలకొల్పడంతో ప్రభుత్వం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. జిల్లాలో టమోటా లాంటి పంటలకు ధర స్థిరీకరణకు ఉపయోగపడుతుందని చెప్పారు. వేరుశనగకు సంబంధించి విలువ ఆధారిత ఉత్పత్తులు అయిన చిక్కి, నూనె, బటర్, రోస్టర్, సాల్టెడ్, పీనట్స్ తయారీ, ఇతర ఉత్పత్తుల కేంద్రం నెలకొల్పడం వల్ల 15 వేల రైతులు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. జిల్లాలో రెండున్నర లక్షల టన్నుల వేరుశనగ ఉత్పత్తి జరుగుతున్న తరుణంలో రైతులకు మార్కెటింగ్ పరమైన ఇబ్బందులు నుంచి ఉపశమనం కలుగుతుందని ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు. అనంతరం వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ల శిలాఫలకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, చెన్నేకొత్తపల్లి జడ్పిటిసి గోవిందరెడ్డి, ఎంపిపి అంజలి, ఏడీఏ కృష్ణయ్య, జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమలు రిసోర్స్ పర్సన్ హరీష్, చిగిచెర్ల సర్పంచి ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ భారతి కుటుంబసభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

డాక్టర్ భారతిని అభినందించిన హైకోర్టు న్యాయవాది

ప్రజాశక్తి -పెనుకొండ

సంకల్పం గొప్పదైప్పుడు సాధించాలనుకున్న లక్ష్యం ఎంత పెద్దదైన చాలా చిన్నదిగా కనబడుతుందని అందుకు ప్రత్యక్ష నిదర్శనం డాక్టర్ సాకే భారతి అని హైకోర్టు న్యాయవాది శివ రామకృష్ణ తెలిపారు. ఎస్‌కె యూనివర్సిటిలో డాక్టరేట్ అందుకున్న డాక్టర్ సాకే భారతికి ఆయన మంగళవారం అనంతపురం పట్టు చీర, రూ 10వేల నగదు అందజేసి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ సాకే భారతి తన అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ రవికుమార్, కొనాపురం కొల్లప్ప, సోమందేపల్లి సూరి, టెంపో సీనా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు స్థలాలు ఇచ్చే వరకూ పోరాటం

- 2వ రోజు కొనసాగిన సిపిఎం భూస్వాధీన ఉద్యమం
- పట్టాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

668 సర్వే నెంబర్‌లో పేదలతో కలిసి సిపిఎం నాయకులు ఆందోళన

అధికారులతో మాట్లాడుతున్న సిపిఎం, వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో ఇళ్లు లేని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, వ్యకాసం, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన భూస్వాధీన పోరాటం మంగళవారం నాడూ కొనసాగింది. 668 సర్వే నెంబర్ ప్రభుత్వ స్థలంలో పేదలు సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నారు. అధికారులు తక్షణం తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, గృహాలు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకటరాముడు తదితరులు మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేసే వరకు భూస్వాధీన పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. అధికారులు స్పందించే వరకు ఈ ప్రాంతంలోనే గుడిసెలు వేసుకుని అక్కడే ఉంటామన్నారు. పేదలకు సొంతిళ్లు లేక బాడుగలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇళ్ల స్థలాల కోసం ప్రజలు తహశీల్దార్, కమిషనర్, సబ్ కలెక్టర్, సచివాలయంలో అనేకమార్లు అర్జీలు ఇచ్చినా దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. అర్జీ పెట్టుకున్న 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామన్న హామీ నెరవేరడం లేదన్నారు. అధికారులు స్పందించి పెనుకొండలోని 668 సర్వే నెంబర్‌లో పేదలకు పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భూస్వాధీన పోరాటం విషయం తెలుసుకున్న తహశీల్దార్ స్వర్ణలత, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని, దీనికి కొంత సమయం కావాలని వారు చెప్పారు. ఇందుకు నాయకులు ఒప్పుకోలేదు. ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఈ స్థలం నుంచి కదిలేది లేదంటూ నాయకులు వారికి తెగేసి చెప్పారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, వెంకటేష్, తిప్పన్న, కొండా వెంకటేష్, రంగప్ప పాల్గొన్నారు.

రుణవిముక్తి చట్టాన్ని తీసుకురావాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్.

కేరళ ప్రభుత్వ తరహాలో రుణ విముక్తి చట్టాన్ని తీసుకుని రావాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ప్రధానకార్యదర్శి జేవీజ రమణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...ఉమ్మడిజిల్లాలో అకాలవర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు వాతావరణ బీమాను వర్తింపచేయాలని, ఇన్సూరెన్స్ పూర్తిస్థాయిలో చెల్లించాలని, రైతుల మోటార్లకు స్మార్ట్‌మీటనే చెల్లించాలని కోరారు. ప్రతి రెతుకు ఎకరాకు రూ.10వేలు సాగుసాయం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఈనెల 26న జరిగిన ఈ సందస్సును విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు కొత్తపేట మారుతి, నాయకులు నాగరాజు, శ్రీరాములు, రేగాటిపల్లి రవి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి మడకశిర రూరల్

మడకశిర మండలంలోని సర్పంచులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ప్రతి పంచాయతీలోనూ 10 లక్షలు పైగా డబ్బులు పంచాయతీకి ఖర్చు పెట్టామని ఇంతవరకు నిధులు రాకపోవటంతో తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సర్పంచులు తమ నిరసనను వ్యక్తం చేస్తూ సమావేవాన్ని బాయ్‌కాట్ చేశారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈసందర్భంగా వారు నిధులు లేకపోవటంతో పంచాయతీలను ఎలా అభివృద్ధి చేయాలని ఎంపీడీవో సోనీ బాయ్‌తో వాగ్వాదానికి దిగారు. వెంటనే 14, 15 ఆర్థిక నిధులు విడుదల చేయాలని సర్పంచులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీరు, డ్రయినేజీ సమస్యలను కూడా పరిష్కరించలేకుండా ఉన్నామని వాపోయారు. సర్పంచుల కు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచిలు గీతమ్మ, రంగనాథ్, కరయన్న తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచులు

స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డిపిఒ కార్యాలయం ముందు నాయకులు, కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్వచ్ఛభారత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరామయ్య కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలోని డిపిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు సజ్జరాయప్ప, పైపల్లి గంగాద్రి, బ్యాళ్ల అంజి, సిద్దు, బాబావాలి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రెండు గంటలపాటు డిపిఒ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరామయ్య మాట్లాడుతూ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, హైకోర్టు తీర్పును వెంటనే శ్రీ సత్యసాయి జిల్లాలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 21 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు రామచంద్ర, ఆదిమూర్తి, సుధామణి, ఆదినారాయణప్ప, నరసింహ, స్వచ్ఛభారత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి వాల్మీకుల సమస్యలు

ప్రజాశక్తి -పెనుకొండ

వాల్మీకి, బోయల సమస్యలపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, శ్రీసత్యసాయి జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మనూరు జయరాంతో రాష్ట్ర వాల్మీకి/బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర మంగళవారం చర్చించారు. కర్నూలు జిల్లా ఆలూరు పట్టణంలోని మంత్రి నివాసంలో రాష్ట్ర వాల్మీకి/బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాంను 56 బిసి కులాల కోఆర్డినేటర్ ప్రవీణ్, వాల్మీకి సంఘం నాయకులు రవి, పెద్దిరాజు తదితరులతో కలిసి పొగాకు రామచంద్ర ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి గుమ్మనూరు జయరాంతో రాష్ట్రం లోని వాల్మీకి/ బోయల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పాదయాత్ర నటేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పొగాకు రామచంద్ర

అర్హులందరికీ ఓటు హక్కు

బత్తలపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్తగా ఓటు హక్కు నమోదు చేస్తామని తహశీల్దార్ యుగేశ్వరీదేవి తెలిపారు. మంగళవారం బత్తలపల్లి మండలంలో జరుగుతున్న ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. బత్తలపల్లిలో బిఎల్ఎలు ముత్యాలప్ప, నరసింహులు ఓటరు సర్వేను చేస్తుండగా కలెక్టర్ తనిఖీ చేశారు. డబుల్ ఎంట్రీలు. చనిపోయిన వారి పేర్లు, వివాహం చేసుకొని వెళ్లిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం. జరుగుతుందన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు వచ్చే నెల 21వ తేదీ వరకు సమయం ఉందన్నారు. అంతలో సర్వేను ముగించాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం

కదిరి అర్బన్ : వైసిపి ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని వైసీపీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని చూసి ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక విమర్శలకు దిగుతున్నారన్నారు.

ఓటరు నమోదు వేగవంతం

గాండ్లపెంట : మండల వ్యాప్తంగా ఓటరు నమోదును వేగవంతం చేయాలని తహశీల్దార్ హమీద్‌బాషా ఆదేశించారు. ఓటరు నమోదుపై బిఎల్ఒలకు మంగళవారం పలు సూచనలు చేశారు. 24 పోలింగ్ బూత్‌లలో బిఎల్వోలు ఇంటింటి సర్వే చేసి ఓటరు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అమానుల్లా. బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు

ధర్మవరం టౌన్ : నేత్రదానం చేసి మరో ఇరువురికి కంటి వెలుగును ప్రసాదించే అవకాశం ఉందని యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకె. శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన వారి నేత్రాలను దానం చేస్తే వాటితో మరో ఇద్దరికి ప్రపంచంలో కంటి వెలుగును ప్రసాదించవచ్చునని చెప్పారు. ఇప్పటికే నేత్రదానంపై అనేకచోట్ల అవగాహన సదస్సులు కూడా నిర్వహించామన్నారు. గత పది సంవత్సరాలుగా తాము 200 మంది తో నేత్రదానాన్ని స్వీకరించి, వారం రోజుల లోపులే మరో ఇరువురికి కంటిని అమర్చి, కంటి వెలుగును నింపామన్నారు. ప్రతి కుటుంబంలో కూడా నేత్రదానంపై తప్పక అవగాహన చేసుకోవాలని, ఇప్పటికే జిల్లాలో యువసే ఫౌండేషన్ సంస్థ అగ్రగామిగా నిలవడం గర్వంగా ఉందని తెలిపారు. కుటుంబంలో ఎవరైనా మతి చెందితే ఎనిమిది గంటల లోపు తమకు సమాచారాన్ని ఇస్తే నేత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గోరంట్ల: పట్టణంలో ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ శృతి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు రక్తం శాతం పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగతంగా శుభ్రంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఆశా వర్కర్లు సుజాత, వరలక్ష్మి, ఎఎన్ఎం అనిత తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతర్

గాండ్లపెంట : హైకోర్టు ఉత్తర్వులను స్థానిక తహశీల్దార్ బేఖాతరుల చేస్తున్నారని సింగిల్‌విండో అధ్యక్షులు హైదర్, న్యాయవాది ఫైజుల్లా విమర్శించారు. ఈసందర్భంగా వారు మంగళవారం మాట్లాడుతూ తమ ఆధీనంలో ఉన్న సర్వే నెంబర్. 854 -3లో ఉన్న భూమిని ఇతరులకు కేటాయించి పాసుబుక్కు తయారు చేసి ఇచ్చారన్నారు. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లగా తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయన్నారు. దీంతో తాము పట్టాదారు పాసుబుక్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో తహశీల్దార్ ఉద్దేశ్య పూర్వకంగా తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. తహశీల్దార్ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు చెప్పారు.

ఓపెన్ ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదల

కొత్తచెరువు : జూన్ జరిగిన ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదల అయినట్లు జిల్లా వృత్తి విద్య అధికారి లాజర్ తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా జూన్ లో జరిగిన పదవ తరగతి పరీక్షలకు 544 మంది హాజరుకాగా 430 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఇంటర్మీడియట్ ఓపెన్ లో 695 మంది పరీక్షలు రాయగా 525 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

పెనుకొండ ఎఒగా శంకరనాయక్

పెనుకొండ : పెనుకొండ నూతన వ్యవసాయ అధికారిగా కదిరి డివిజన్‌లో పనిచేస్తున్న బి. శంకర్ నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎఒకు ఎఇఒలు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రం సిబ్బందితో ఎఒ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఓబులదేవరచెరువు : మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండల కేంద్రంలో కదిరి హిందూపురం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐపుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో సాగనంపి దేశాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు చలపతి, సుధాకర్, గంగులప్ప, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మధుమతిని కలిసిన సమన్వయకర్త

హిందూపురం : రూరల్ మండలంలో చౌళురులో మధుమతి రెడ్డిని వైసిపి సమన్వయ కర్త దీపిక వేణురెడ్డి మంగళవారం కలిశారు. దారుణ హత్యకు గూరైన చౌళూరు రామకృష్ణా రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కలిసి పని చేద్దాం అని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు మారుతీ రెడ్డి, శివ, షాజియా, ఆసీఫ్‌వుల్లా, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తం రెడ్డి, లేపాక్షి కన్వీనర్ నారాయణ స్వామి, నాగరాజు, ఖలీల్, మహేష్, జనర్దాన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రెవెన్యూ, పోలీసు, ఇతర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో సమిష్టిగా పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి , జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పుట్టపర్తి లోని సాయి ఆరామం లోని ఫంక్షన్ హాలులో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఐజి మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఇతర ప్రభుత్వ శాఖలలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. నేరాల్లో పాలు పంచుకున్న వారు ఎవరైనా ఎంతటి వారైన సరే చట్టం ద్వారా వారికి శిక్ష పడేలా దర్యాప్తు చేయాలని అన్నారు. పలు కేసులలో పై కోర్టు లు ఇస్తున్న తీర్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటికి అనుగుణంగా తరువాత కేసులలో ముందుకు సాగాలని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు.కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ, పోలీసు శాఖలు మంచి సమన్వయంతో ముందుకెళుతుండటం శుభపరిణామని అన్నారు. పోలీసు అధికారులు జిల్లా సరిహద్దు గ్రామాల్లో పల్లె నిద్రలు చేసేటప్పుడు లేదా గ్రామాల సందర్శన సమయంలో స్థానిక సమస్యలపైనే కాకుండా బాల్య వివాహాలపై అవగాహన పెంచాలని సూచించారు. ఫోక్సో కేసుల్లోని బాధితురాళ్లకు పునరావాసంతో పాటు విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది హైవే అథారిటీ వారితో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. ప్రజలలో పోలీసుల పట్ల విశ్వాసం పెంపొందేలా మెలగాలని కోరారు. రౌడీ షీటర్లు పాత నేరస్తులపై నిఘా కొనసాగించాలని అనుమానాస్పదతో మృతి చెందిన కేసులలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి డిఐజి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ .విష్ణు, జిల్లా పరిధిలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో పాటు రవికుమార్, ఆర్డీవో సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా జరుగుతున్న భూ కబ్జాలపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా నియోజక వర్గ వ్యాప్తంగా జరుగుతున్న భూ కబ్జాలపై వివరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, పారల్మెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, రాష్ట్ర నాయకులు అంజినప్ప, రామాంజినమ్మ, న్యాయవాది శివశంకర్ మాట్లాడుతు వైసిపి అధికారంలోకి వచ్చాక సామాన్యుల భూములకే కాదు దేవాదాయ శాఖకు చెందిన భూములకు సైతం రక్షణ కరువైందన్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కొంత మంది దానికి దొంగ పత్రాలను సృష్టించి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఫిర్యాదులు చేసినప్పటికి చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అవుతున్నారన్నారు. ఇందులో అధికార పార్టీ నేతల హస్తం ఉందని స్పష్టమవుతోందన్నారు. వీటితో పాటు ఈ మధ్య కాలంలో డబుల్ రిజిస్టర్‌ల సంఖ్య ఎక్కువ అయిందన్నారు. చిలమత్తూరు మండలం వీరపురం గ్రామంలో అధికార పార్టీ నాయకుని ఇంటికి వెళ్లడానికి దారి కోసం దళిత గంగాధరప్ప ఇంటిని తొలగించడానికి అధికారులు వెళ్లడం చూస్తుంటే అధికారులు వారి విధులను అధికార పార్టీ నేతలకు ఎంత దాసోహం అయి చేస్తున్నారో తెలుస్తోందన్నారు. హిందూపురం ప్రాంతంలో జరుగుతున్న భూ కబ్జాలపై త్వరలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు అజ్మతుల్లా, అమర్నాథ్, దుర్గా నవీన్, రాము, శ్రీనివాస రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం లో ఉర్దూ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్జాన్ డిమాండ్ చేశారు.ఈ మేరకు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహ్మద్‌ని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా బాబ్జాన్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు పరీక్షల సమయంలో సకాలంలో హాల్ టికెట్లు ఇవ్వలేదన్నారు. జెవిడి డబ్బు మొత్తం చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అదేవిధంగా కదిరి పట్టణంలో ప్రభుత్వ ఉర్దూ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

ప్రొఫెసర్ నజీర్‌ను కలిసిన ఎస్ఎఫ్ఐ బాబ్జాన్

కరపత్రాలను విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు, తదితరులు

బస్సుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కదిరి టౌన్

దేశంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలు హింసలపై పోరుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అధ్వర్యంలో హింసపై మహిళల పోరు యాత్ర పేరుతో చేపట్టిన రాష్ట్ర బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. బస్సుయాత్ర ఈ నెల 28న కదిరికి వస్తున్న నేపథ్యంలో ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు శాంతిభాయి, ఆదిలక్ష్మి, సుశీల, నాగమణి, రత్నమ్మ, నారాయణమ్మ, హేమావతి, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ఆంజనేయులు, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో బోరు బావుల క్రింద వరిపంట సాగుచేసిన రైతులు నారుదశ నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త రవి కిషోర్ పలు సూచనలు చేశారు.నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉన్నప్పుడు వేయాలన్నారు. రైతులు 15 రోజుల ముందు ప్రధాన పొలంలో ఆకు లేక జీలుగా వేసి దమ్ము చేయాలన్నారు. 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేసుకున్నట్లయితే బాగా కుళ్లిపోతుందని చెప్పారు. దుక్కిలోనే 150 కిలోల సూపర్ ఫాస్పేట్ ప్లస్ 50 కిలోల యూరియాతో పాటు 25 కిలోల మ్యు రేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు వాడాలన్నారు. ప్రతి మూడు పంటలకు ఒకసారి 25 కిలోల జింక్ సల్ఫేట్ ఎకరాకు ఆఖరి దుక్కిలో వేసుకోవాలని సూచించారు. నాట్లు లోతుగా నాటకుండా వరిలో కాలిబాటలు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు దూరం వదలాలని చెప్పారు. దీని వల్ల గాలి వెలుతురు ప్రసరణ ఎక్కువగా ఉండి దోమపోటు తగ్గుతుందని వివరించారు. కలుపు సమస్య ఉన్న పొలంలో నాటిన మూడు రోజులలోపు బ్యూటాక్లోర్ ఒక లీటరు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలని వారు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 26 నుంచి డిగ్రీ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థికి ఫీజులతో సంబంధం లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కళశాల వసతిగృహంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు ఫీజులు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామనిపట్టణంలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు వేధిస్తున్నాయని విమర్శించారు. ఫీజులతో సంబంధం లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలన్నారు. విద్యార్థులను వేధిస్తే ఆలాంటి కళాశాలల ముందు ఆందోళనలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నా జగనన్న విద్యా దీవెనను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, హర్ష కుమార్, బాలాజీ, రంగప్ప, భగత్, బాబా ఫక్రుద్దీన్, భూతరాజు, లోకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి బుగ్గిరి త్రివేణి అన్నారు. మంగళవారం మండలంలోని మాల్యవంతం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సౌజన్యకుమార్, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైస్‌ఎంపీపీ సాకే పార్వతి, ఈవోఆర్డీ దివాకర్, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, వెంకటేష్. ప్రతాపరెడ్డి తదితరులు హాజరయ్యారు. 2.314 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.

నల్లచెరువు : మండల పరిధిలోని తలమర్ల వాండ్ల పల్లి, ఎర్రగుంట పల్లిలో ఎంపీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు కలుగుతున్న ఉపయోగాలను వివరించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాలైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని స్పెషల్ ఆఫీసర్ సుబ్బదాసు పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్మగొండ పాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చేతుల మీదుగా గ్రామ సచివాలయ పరిధిలో 700 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి ,ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతీదేవి, అగ్రికల్చర్ ఎడి సనావుల్లా, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జెడ్పీటీసీ బాణాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి ,వైస్ ఎంపీపీ అంజినరెడ్డి , స్థానిక ఎంపీటీసీ అశ్వర్థప్ప, లేపాక్షి సర్పంచి ఆదినారాయణ, తహశీల్దార్ బాబు, ఎంపీడీవో నరసింహ నాయుడు, స్థానిక వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి విలేకరులు

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కోరుతూ శ్రీసత్యసాయి జిల్లాలో విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. పుట్టపర్తి, కదిరి, కొత్తచెరువు, ధర్మవరం, ఓబులదేవర చెరువు, లేపాక్షి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, రొద్దం తదితర మండలాల్లో విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్ల విద్యార్థిసంఘాల నాయకులు ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థిసంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ విధానాలతో పేదలకు విద్య దూరమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

కనగానపల్లి : మండలం పరిధిలోని చంద్రాచర్ల గ్రామానికి చెందిన యువకుడు మంగళవారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. అందుకు సంబంధించిన వివరాలు... గ్రామానికి చెందిన రాయపాటి శివకుమార్(32) మంగళవారం ఉదయం ఇంటి అవసరాలకు నీటికోసం తన ఇంటిలోని మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడి పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శివకుమార్ మృతిచెందాడు. మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి కుటుంబం వీధిపాలైంది. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

లోచర్లలో పాడిఆవు...

కొత్తచెరువు : మండల పరిధిలోని లోచర్ల గ్రామంలో విద్యుత్తు తీగ తగిలి షాక్‌కు గురైన పాడిఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే రైతుకు చెందిన పాడి ఆవు మంగళవారం ఉదయం ఇంటి సమీపంలోనే నీరు తాగేందుకు వెళుతున్న సమయంలో కిందికి వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.

కర్నాటక మద్యం విక్రేత అరెస్టు

హిందూపురం : పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్ పరిధిలో బాపూజి నగర్‌లో వన్ టౌన్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి కర్నాటక మద్యం విక్రయిస్తున్న మారుతీ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 458 టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరూన్‌బాషా తెలిపారు. ఈ దాడుల్లో అనీల్, నరేష్, వెంకటరామిరెడ్డి, గోపాల్, స్పెషల్ పార్టీ సిబ్బంది శివ, మహాలింగ, గురు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ ఆత్మహత్య

కదిరి అర్బన్ : పట్టణ పరిధిలోని కుటాగుల 36 వ వార్డు వాలంటీర్‌గా పనిచేస్తున్న అశ్విని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. భార్య,భర్తల మధ్య నెలకొన్న చిన్న పాటి గొడవతో మనస్థాపానికి గురైన అశ్విని వాస్మాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం 9 నెలల గర్భవతి. వాలంటీర్ మృతివార్త తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్ రెడ్డి, వైసీపీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

కనగానపల్లి : మండల కేంద్ర సమీపంలోని మామిళ్లపల్లి వెళ్లే రహదారిపై చెరువు కట్ట దగ్గర మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. గ్రామానికి చెందిన గవ్వల బండక్క (60) పొలం పనికి వెళ్లి తిరిగి రహదారి పై నడిచి వస్తుండగా కనగానపల్లి గ్రామానికిచెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనం పై మామిళ్ళపల్లి వైపు వెళ్తు వృద్ధురాలిని ఢీ కొనగా ఆయె అక్కడికక్కడే మతి చెందింది. ద్విచక్ర వాహనం పై వస్తున్న యువకుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధితులకు పరామర్శ

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆది పరామర్శించారు. కోవెలగుట్టపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పి వెంకటేష్ తండ్రి పి గంగన్న గత వారం కిందట ప్రమాదవశాస్తు వారి నివాసం వద్ద మిద్దె మీద నుంచి కిందకి పడడంతో కాలు విరిగింది. చికిత్స తీసుకొని తన నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గంగన్నను సామకోటి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు, వెంకటేష్, గోపాల్, వెంకట్రాముడు, రఘువరన్, రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కనగానపల్లి : మండల పరిధిలోని కుర్లపల్లి తండాకు చెందిన టీడీపీ నాయకుడు రాజునాయక్ గుండెపోటులో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసకున్న ప్రొఫెసర్ రాజేష్ మృతదేహాన్ని సందర్శించిన నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి తనవంతుగా లక్షరూపాలను అందజేశారు. మృతుడు రాజునాయక్ ప్రొఫెసర్ రాజేష్‌కు ముఖ్య అనుచరుడు.

టిడిపి నాయకుడు మృతికి సంతాపం

మడకశిర : మండల పరిధిలోని గౌడన్నహళ్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామప్ప అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి , సత్య సాయి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు గుండుమల రాధాకృష్ణ , మండల కన్వీనర్ లక్ష్మి నారాయణ , క్లస్టర్ ఇన్‌చార్జి కల్లుమర్రి నాగరాజు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

బాధితులకు పరామర్శ

బుక్కపట్నం : అనారోగ్య కారణాలతో బాధపడుతున్న మండలంలోని వైసిపి నాయకులు , కార్యకర్తలను ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిద్ధరామపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రాయన్ పల్లి గ్రామం నందు అనారోగ్యంతో బాధపడుతున్న విజయ్, భాస్కర్ తదితరులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణయ్య, వైసిపి నాయకులు కేశప్ప, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కదిరి టౌన్ : మండలంలోని కటకం వారి గ్రామానికి చెందిన మంకు చెందిన వడ్డే శంకర్ అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకొని వైఎస్సార్సీపీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ తన తండ్రి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శించి,దహన సంస్కారాల కొరకు కుటుంబసభ్యులకు రూ. 10వేల సాయం అందించారు.

మణిపూర్ ఘటనకు ప్రధాని బాధ్యత వహించాలి

పుట్టపర్తి అర్బన్ : మణిపూర్ లో జరుగుతున్న మారణకాండ కు ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యత వహించి రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం గణేష్ కూడలి వద్ద సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమైక్య నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ, బిజెపి రెండు తెగల మధ్య కుల చిచ్చు రేపి హింసకాండకు పూనుకొందన్నారు. సభ్య సమాజంలో ఇంత దారుణం జరుగుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరాచక శక్తులను అణచివేయడంలో పూర్తిగా విఫలమైనాయన్నారు. . ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కార్యదర్శి ఆంజనేయులు, మహిళా సమైక్య నాయకురాలు జయలక్ష్మి, వ్యకాసం గంగాధర్, గిరిజన సమైక్య రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మణిపూర్ లో జరుగుతున్న మారణ హోమంపై దేశ ప్రదాని నరేంద్ర మోదీ మౌనం వీడి వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్‌కు సిఫార్సు చేయాలని ఎఐటియుసి,ప్రజా సంఘాల నాయకులు డిమెండ్ చేశారు. మణిపూర్ ఆదివాసుల మహిళలపై దాడి చేస్తున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు వర్షంలోనే పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. బాబు, వినోద్ కుమార్, జబివుల్లా, మారుతీ రెడ్డి, ఆసియా బాను, ప్రజా సంఘాల నాయకులు చైతన్య గంగిరెడ్డి, ముస్లిం నగారా నాయకులు ఉమర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో ఆందోళన నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు